కేక్.. ట్రెండీ లుక్!

స్పెషల్ అకేషన్ అంటే కేక్ కట్ చేయాల్సిందే.. సెలబ్రేషన్ అంటే కేక్‌తో ప్రారంభించాల్సిందే.. పుట్టిన రోజు వేడుక అయినా.. పెళ్లి ఫంక్షన అయినా.. కిట్టీ పార్టీ అయినా కేక్ కటింగ్‌తోనే మొదలవుతాయి. నేటి ఆధునిక సమాజానికి తగినట్టు వెరైటీ డిజైన్లు మార్కెట్‌లోకి వచ్చేశాయి. వినూత్న ఆకృతులు.. వివిధ ఫ్లేవర్లలో లభ్యమవుతున్నాయి. చూడముచ్చటగా.. నోరూరించేలా సిద్ధమవుతున్న కేక్‌లు యువతను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. వినియోగదారుల అభిరుచి మేరకు తిరుపతి నగరంలోని బేకరీల్లో రూపుదిద్దుకుంటున్నాయి. ముఖ్యంగా ట్రెండీ లుక్‌తో ఫొటో ప్రింటెడ్.. హైపర్ రియలిస్టిక్.. థీమ్ కేక్‌లు కనువిందు చేస్తున్నాయి.

- వినూత్నంగా కేక్‌లు తయారు చేస్తున్న బేకరీలు
- యువతను ఆకట్టుకుంటున్న వెరైటీ డిజైన్లు
- సెలబ్రేషన్‌లకు అనుగుణంగా ఆర్డర్లు



బేకరీలో విక్రయానికి సిద్ధం చేసిన కేక్‌లు

తిరుపతి తుడా : కేక్ చరిత్ర నిజానికి చాలా ఆసక్తికరమైనదే. కేక్ అనే పదం పాత ఈజిప్ట్‌కు చెందిన నార్స్ భాషకు చెందిన «కాకా» అనే పదం నుంచి పుట్టింది. దీని అర్థం «ఫ్లాట్ బ్రెడ్». పాత రోజులలో కేకులు ప్రస్తుతం మనం తినే బిస్కెట్ల రూపంలో ఉండేవి. ఆ రోజుల్లో పంచదార చాలా ఖరీదుగా ఉండేది. అందువల్ల కేక్‌ల తయారీలో తేనె వినియోగించేవారు. గోధుమ పిండి, తేనె, పప్పుదినుసులతో తయారు చేసేవారు. పండుగలు, రాజులు పట్టాభిషేకం సమయాల్లో కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకునేవారు. కాల క్రమేణా గ్రీకులు ప్రతి సెలబ్రేషన్‌లోనూ కేక్ కటింగ్ ఆనవాయితీగా మారింది. దీంతో గ్రీకులే కేకులను కనిపెట్టినట్లు చరిత్ర చెబుతోంది. 1764లో డాక్టర్ జేమ్స్ బేకర్, జాన్‌హన్నన్ వినూత్నంగా ఆలోచించి కేక్‌లకు ఫ్లేవర్లు జోడించే సంప్రదాయం ప్రారంభించారు. కోక్ గింజలను పొడిచేసి చాక్‌లెట్ ఫ్లేవర్‌తో తయారు చేసే కేక్‌కు నేటికీ ప్రాధాన్యత తగ్గలేదు. ప్రపంచంలో తొలి ఫ్లేవర్ కేక్ సైతం ఇదే కావడం విశేషం.

సందర్భానికి అనుగుణంగా..

మనదేశంలో 1832 నుంచి కేక్‌ల సందడి ప్రారంభమైనప్పటికీ ఉన్నత వర్గాల వేడుకలకు మాత్రమే పరిమితమైంది. 1990 నుంచి కేక్‌లను వెరైటీ డిజైన్‌లలో తయారు చేయడం ప్రారంభించారు. 2001 నుంచి కేక్‌లు ట్రెండ్ పూర్తిగా మారింది. సాధారణ కేకులతో పాటు ఐస్ కేక్‌లకు డిమాండు పెరిగింది. బర్త్‌డే, న్యూయర్, పండుగలు, విజయోత్సవాలు, క్రిస్మస్, వాలంటైన్స్‌డే, మ్యారేజ్, ఎంగేజ్‌మెంట్ ఫంక్షన్లలో సైతం తమ అభిరుచుల మేరకు ప్రజలు కేక్‌లను ఆర్డర్ చేస్తున్నారు. 300 గ్రాముల కేక్ నుంచి 100 కేజీల వరకు ఆకట్టుకునే ఆకృతుల్లో కేక్‌లను బేకరీ నిర్వాహకులు తయారు చేయడం ప్రారంభించారు. తిరుపతి నగరంలో సుమారు వందకు పైగా ఉన్న బేకరీల్లో పేరొందిన పది బేకరీలు కేకుల తయారీలో బిజీబిజీగా ఉంటున్నాయి. నెలకు ఒక్కో బేకరీ బిజినెస్ సుమారు రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందంటే, డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు

ఆకృతి మేరకు రేటు

కస్టమర్ ఆసక్తి, అభిరుచి, డిజైన్, టేస్ట్, ఫ్లేవర్, సైజ్ ఆధారంగా కేక్‌లు రూ.300 నుంచి రూ.లక్షల వరకు మార్కెట్‌లో ధర పలుకుతున్నాయి. వినియోగదారుల ఆర్థిక స్తోమత బట్టి కేక్‌లు ఆర్డర్ ఇస్తున్నారు. బేకరీల నిర్వాహకులు సైతం కేక్‌ల తయారీకి నాణ్యమైన పదార్థాలనే వాడుతున్నారు. బెంగళూరు, చైన్నె, హైదరాబాద్, ముంబయి తదితర నగరాల నుంచి ముడి సరుకులను దిగుమతి చేసుకుంటున్నారు. ప్రత్యేకంగా శిక్షణ పొందిన వారితో కేక్‌లు సిద్ధం చేయిస్తున్నారు. వీరికి నెలకు అనుభవాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.45వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు.

చక్కటి డిజైన్లకు డిమాండ్

నగరంలో యువత చక్కటి ట్రెండీ డిజైన్ల కేక్‌లకు ఎక్కువగా ఆర్డర్లు ఇస్తున్నారు. మేము కూడా కస్టమర్‌కు నచ్చేలా కేక్‌లు అందిస్తున్నాం. చిన్నపిల్లలను కార్టూన్ కేక్‌లు అధికంగా ఆకట్టుకుంటున్నాయి. కేక్‌ల తయారీలో నాణ్యమైన పదార్థాలనే వాడుతున్నాం. అందుబాటు ధరలతోనే వినియోగదారులకు అందజేస్తున్నాం.

– ఇబ్రహీం, బేకరీ యజమాని, తిరుపతి

సంతోషంగా ఉంటుంది

మా పెళ్లిరోజు కోసం 5 కేజీల కేక్ ఆర్డర్ ఇచ్చాం. ఇందుకోసం రూ.12వేలు వెచ్చించాం. కేక్‌పై మా పెళ్లి ఫొటో వచ్చేలా వెరైటీగా డిజైన్ చేయించాం. బంధువులు, స్నేహితులు అందరూ మా ఇంటికి వచ్చారు. అతిథుల ఎదుట కేక్ కట్ చేస్తే చాలా సంతోషంగా ఉంటుంది. కేక్ కటింగ్‌తో మా పెళ్లి రోజు మరచిపోలేని మధురానుభూతిని పంచింది.

– అనుపమ, గృహిణి, తిరుపతి

యువతను ఆకట్టుకునేలా డిజైన్లు

ప్రస్తుతం యువత నూతన డిజైన్ల వైపు మొగ్గు చూపుతోంది. నగరంలోని బేకరీలు ఇందుకు తగ్గట్టు సుమారు 280 రకాల కేకులను తయారు చేస్తున్నాయి. ప్రధానంగా చాక్లెట్ ఫ్లేవర్, బ్లాక్ ఫారెస్ట్, పైనాపిల్, రెడ్ వాలెట్, క్యారెట్, చీజ్ కేక్, వెన్నెల, బ్రంచ్, బట్టర్ స్కాచ్, కాఫీ, మ్యాంగో, బనానా, కోకోనట్, బ్లూ బెర్రీ, స్ట్రాబెర్రీ, ఫ్రూట్ వంటి ఫ్లేవర్లకు డిమాండ్ అధికంగా ఉంటోంది. అలాగే పలువురు వినియోగదారులు తమకు ఇష్టమైన కార్టూన్, క్రికెట్ పిచ్, హీరోలు, దేవుళ్ల చిత్రాలు, బేబీ ఫొటోలు, గ్రీన్ సీనరీలు, అభిమాన నాయకులు, క్రీడాకారులు, ఫ్రూట్ డిజైన్‌లు, పేరొందిన భవనాలు వంటి చిత్రాలతో కేక్‌లను తయారు చేయించుకుంటున్నారు.



నెమలి బొమ్మతో సిద్ధం చేసిన కేక్









వివిధ సందర్భాలకు అనుగుణంగా పలు ఆకృతుల్లో తయారు చేసిన కేక్‌లు

క్లుప్తంగా

కేబీఆర్ నగర్‌కు వరద పోటు!



కల్వర్ట్ దెబ్బతినడంతో పొంగుతున్న వర్షపు నీరు

తిరుపతి మంగళం: మంగళం తిరుమలనగర్ పంచాయతీలోని కేబీఆర్‌నగర్‌కు వరద పోటు తప్పడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే నీటితో పెద్ద కాలువ పొంగి కాలనీ జలమయంగా మారుతోంది. ప్రజలు కనీసం ఇంటి నుంచి కూడా బయటకు రాలేని పరిస్థితి వస్తోంది. ఈ క్రమంలోనే శనివారం రాత్రి కురిసిన వర్షానికి కేబీఆర్ నగర్ ప్రధాన మార్గంలోని కల్వర్టు దెబ్బతిని నీరు కాలనీలోకి చేరింది. ఈ మేరకు కల్వర్టుకు వెంటనే మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఏరియా ఆస్పత్రికి అడ్వాన్స్‌డ్ బెడ్



పడకను విరాళంగా అందిస్తున్న ఢిల్లీరెడ్డి

చంద్రగిరి : స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల సౌకర్యార్థం ఓ దాత అడ్వాన్స్‌డ్ బెడ్‌ను విరాళంగా ఆదివారం అందించారు. తిరుపతి కట్టకింద ఊరు సమీపంలోని కొత్తపల్లెకి చెందిన జవాజీ ఢిల్లీ రెడ్డి తన తండ్రి కొల్లా రెడ్డి జ్ఞాపకార్థం రూ.30వేల విలువైన బెడ్‌ను ఆస్పత్రి అధికారులకు అందజేశారు. ఈమేరకు దాత ఢిల్లీరెడ్డికి అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కార్పొరేషన్ 'గ్రీవెన్స్'

తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీదారులు వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జతపరిచి, ఫోన్ నంబర్ పొందుపర్చాలని సూచించారు.

బీసీవై అధ్యక్షుడి పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న రామచంద్రయాదవ్

భాకరాపేట : బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ ఆదివారం తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. చిన్నగొట్టిగల్లు, భాకరాపేట మీదుగా యాత్ర సాగింది. ఆయన మాట్లాడుతూ శ్రీవారి లడ్డూపై అనుమానాలను తొలగించాలని, ప్రసాదాలను నాణ్యత పెంచి భక్తులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి జనార్ధన్, రాజశేఖర్, జయశంకర్ పాల్గొన్నారు.

జనరల్ సెక్రటరీకి అభినందనలు



రామకృష్ణను సత్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాకాల : స్థానిక అగ్నిమాపక కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను అగ్నిమాపక శాఖ జిల్లా అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక అగ్నిమాపక కేంద్రంలో రామకృష్ణకు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ విశ్వనాథం పాల్గొన్నారు.

దేవరకొండలో కార్డన్ సెర్చ్



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీలో భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రికార్డులు లేని 9 వాహనాలను సీజ్ చేశారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్త వ్యక్తుల కదలికలు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భాకరాపేట ఎస్‌ఐ రాఘవేంద్ర, ఎర్రావారిపాళెం ఎస్‌ఐ ఎర్రిస్వామి, ఎస్‌బీ ఏఎస్‌ఐ దస్తగిరి పాల్గొన్నారు.

'వరల్డ్ హార్ట్ డే' ర్యాలీ



ర్యాలీలో నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీపురం సర్కిల్ నుంచి గోవిందరాజస్వామి ఆర్ట్స్ కాలేజీ వరకు చేపట్టిన ర్యాలీలో హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ సి.వెంకటరమణ, డాక్టర్ ఆర్.నిరుపమ, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కాలేజ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ శిబిరంలో 150 మంది ఉచిత చికిత్స అందించామని వెల్లడించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సెక్రటరీ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

వయో వృద్ధులకు సన్మానం

పాకాల : స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా 28 మంది వృద్ధులను ఘనంగా సన్మానించారు. పాస్టర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ కుటుంబానికి, సమాజానికి వృద్ధుల జీవితానుభవాలు ఎంతో అవసరమన్నారు.నేటి యువత వారి నుంచి నేర్చుకోవాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయని వెల్లడించారు. అనంతరం వృద్ధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెక్రటరీ రాఘవేలు, ట్రెజరర్ అరుళ్‌సెల్వి పాల్గొన్నారు.

బంజారాల సంక్షేమానికి బోర్డు అవసరం

తిరుపతి రూరల్: రాష్ట్రంలోని బంజారా జాతి ప్రజల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య శివా నాయక్ కోరారు. ఆదివారం సాయంత్రం ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందించారు. ప్రపంచంలోనే పప్రథమంగా తిరుపతిలో నిర్మిస్తున్న హథీరాం బావాజీ ఆలయ నిర్మాణం పనుల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు

ముగిసిన ఉరుసు ఉత్సవాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని హజరత్ క్వాజా సయ్యద్ షా జుంలేషా పీర్ ఖాదరవల్లి అల్లా ఉరుసు వార్షిక గంధోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

విజయభారతి రచనలు చిరస్మరణీయం



విజయభారతికి నివాళులర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్ : స్త్రీల హక్కుల ఉద్యమ నేత, అంబేడ్కర్, పూలే జీవిత చరిత్రలను అక్షరీకరించిన విజయభారతి రచనలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం ఎమ్మార్‌పల్లెలోని ఆర్‌పీఐ కార్యాలయంలో రచయిత్రి విజయభారతి సంతాప సభ నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఆర్‌పీఐ దక్షిణ భారత అధ్యక్షుడు పి.అంజయ్య మాట్లాడుతూ స్త్రీలు, దళితుల అణచివేతను తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన ఘనత విజయభారతిదేనన్నారు. పద్మభూషణ్ బోయ భీమన్న కుమార్తె, పౌర హక్కుల ఉద్యమ నేత బొజ్జా తారకం సతీమణి డాక్టర్ బోయి విజయభారతి మరణం యావత్తు సమాజానికి తీరని లోటన్నారు. ఉస్మానియా వర్సిటీలో తెలుగులో డాక్టరేట్ పొందిన తొలి మహిళ విజయభారతి అని కొనియాడారు. ఆమె రచించిన షట్చక్రవర్తులు అనే పుస్తకం 2003లో కెనడాలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ మిషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అవార్డు దక్కించుకుందని వెల్లడించారు. కార్యక్రమంలో టీటీడీ ఎస్సీ,ఎస్టీ ఉద్యోగు సంఘం అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చిన్నం కాళయ్య, ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడు ఎ.సుబ్రమణ్యం, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి నద్ది నారాయణ, బుద్ధవిహార్ అధ్యక్షుడు మునిరత్నం, కృష్ణయ్య, రాజమాణిక్యం, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పురస్కారాలు

తిరుపతి కల్చరల్ : నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గాండ్ల సామాజికవర్గానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు ప్రదానం చేశారు. గాండ్ల, తెలికుల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాకాటి హరికృష్ణ మాట్లాడుతూ గాండ్ల కులానికి చెందిన ఉద్యోగులు భావితరాల భవిష్యత్తు నిర్మాణం కోసం అందుబాటులో ఉండాలని కోరారు. ప్రధానంగా ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని కొనియాడారు. ఉత్తమ ప్రతిభను కనబరచిన వారిని సత్కరించుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయులు కె.విజయలక్ష్మి, రాజ్యలక్ష్మి, రమేష్, చెంచు కృష్ణయ్య, ఆర్కాడు మురళి, కందాటి విజయభారతి , గోపాలకృష్ణ, అనిల్‌కుమార్, టీసీ బాలకృష్ణ, పి.వరలక్ష్మి, పాతల పాటి ప్రసాద్, ఇంజేటి రామకృష్ణారెడ్డి, పన్నూరు మోహనమూర్తి, బీవీఆర్.ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. పురస్కార గ్రహీతలకు రచయిత సాకం నాగరాజు విశిష్ట పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కందాటి రామిశెట్టి, నగర అధ్యక్షుడు బద్రి జయకుమార్, గౌరవాధ్యక్షుడు పూజారి సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మురళి, నాయకులు ఈశ్వరయ్య, దేవరకొండ భాస్కర్, డాక్టర్లు విజయ్, అర్చన, వెంకటముని, మురళి, రెడ్డెప్ప, వినయ్, తేజ, గాండ్ల కుల పెద్దలు జగన్నాథం, పేరూరు పద్మాకర్, బాలసుబ్రమణ్యం, చంద్రశేఖర్, సుధీర్, గిరిశ్రీనివాస్ పాల్గొన్నారు.



అవార్డు గ్రహీతలతో నిర్వాహకులు

3న వారాహి సభ

తిరుపతి(అలిపిరి): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అక్టోబర్ 3న తిరుపతిలో వారాహి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కమిటీ సమావేశం చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాయ శ్చిత్త దీక్ష విరమించేందుకు అక్టోబర్ ఒకటో తేదీన పవన్ కల్యాణ్ తిరుపతికి వస్తున్నారన్నారు. కాలినడకన తిరుమలకు చేరుకుని, 2న శ్రీవారిని దర్శించుకోనున్నారని వెల్లడించారు. సమావేశంలో జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, రాందాస్ చౌదరి, రాజారెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



మురళిని సన్మానిస్తున్న ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు: సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ఎక్సలెన్స్ అవార్డు గ్రహీత, ఉత్తమ ఉపాధ్యాయుడిని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఘనంగా సన్మానించారు. మండలంలోని మన్నసముద్రం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గుమ్మడి మురళికి ఇటీవల అవార్డు ప్రదానం చేశారు. ఈనేపథ్యంలో ఆదివారం ఆయన ఎంపీ గురుమూర్తిని తిరుపతిలోని స్వగృహంలో కలిశారు. ఎంపీ సన్మానించి భవిష్యత్తులో మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు.

పరామర్శ.. నివాళి



శ్రీరాములురెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి దంపతులు

తిరుపతి రూరల్ : మండలంలోని సాయినగర్ పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత శ్రీరాములురెడ్డి కర్మక్రియలకు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు. గాంధీపురం పంచాయతీకి చెందిన వైసీపీ నేత మధుసూదన్ రెడ్డి తల్లి గున్నం రెడ్డి సరస్వతమ్మ కర్మక్రియలకు హాజరై ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం పేరూరు పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్ పరంధామ రెడ్డి తండ్రి సుబ్రమణ్యంరెడ్డి కర్మక్రియలకు హాజరైన చెవిరెడ్డి దంపతులు అంజలి ఘటించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

సీఎంఆర్ లక్కీడ్రా విజేత ఎంపిక



డ్రా తీస్తున్న సీఎంఆర్ అధినేత వెంకటరమణ

తిరుపతి కల్చరల్ : దసరా, దీపావళిని పురస్కరించుకొని వీవీ మహల్ రోడ్డులోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో ఆదివారం రాత్రి లక్కీడిప్ డ్రా ద్వారా విజేతను ఎంపిక చేశారు. వీవీ మహల్ అధినేత పురంధేశ్వర్ అతిథిగా హాజరై విజేతగా సాగర్‌ను ఎంపిక చేసి బహుమతిగా స్కూటర్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని సీఎంఆర్‌లో ప్రత్యేక ఆఫర్లతో పాటు రూ.500లకు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ కూపన్ ఇస్తున్నారన్నారు. ఈమేరకు ప్రతి రోజు డ్రా ద్వారా బహుతులు ఇవ్వడమే కాకుండా, ప్రతి ఆదివారం లక్కీడిప్ ద్వారా విజేతను ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే నవంబర్ 2వ తేదీన బంపర్ డ్రా ద్వారా విజేతను ఎంపిక చేసి కారును బహుమతిగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, స్టోర్ మేనేజర్ బాలకృష్ణ, ఏఎస్‌ఎం రవిశంకర్ పాల్గొన్నారు.

వారపు సంతలో గందరగోళం



చంద్రగిరి వారపు సంతలో జనం

చంద్రగిరి : వారపు సంత వేలం పాటను చేక్కించుకున్న గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆదివారం ఈ మేరకు పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా అధికంగా గేటు వసూలుకు పాల్పడ్డారు. వివరాలు.. సుమారు 3 నెలల తర్వాత చంద్రగిరి వారపు సంతకు శనివారం వేలం పాటను నిర్వహించారు. రూ.14.61లక్షలకు (ఆరు నెలలకు) గుత్తేదారు దక్కించుకున్నారు. ఈ క్రమంలో గుత్తేదారులు రైతులు, వ్యాపారుల వద్ద గేటు వసూళ్లకు పూనుకున్నారు. రూ.100లు ఇచ్చే వ్యాపారి నుంచి రూ.300లు, రూ.30లు వచ్చే రైతు నుంచి రూ.100 గుంజేశారు. దీనిపై చిరువ్యాపారులు, రైతులు మండిపడ్డారు. గత కొన్నేళ్లుగా రూ.30 నుంచి రూ.150ల వరకు మాత్రమే గేటు చెల్లిస్తున్నామని,, ఇప్పుడు అధిక మొత్తం కట్టమంటే ఎలా అంటూ ప్రశ్నించారు. రూ.లక్షలు వెచ్చించి వేలంలో వారపు సంతను దక్కించుకున్నామని, తాము చెప్పిన రుసుము చెల్లించాల్సిందే అని గుత్తేదారులు హుకుం జారీ చేశారు. లేకుంటే ఇక్కడ వ్యాపారం చేసుకునేందుకు వీలులేదని బెదిరించారు. ఆగడాలను ప్రశ్నించివారిపై దౌర్జన్యానికి దిగారు. మహిళలను సైతం దుర్భాషలాడారు. కూరగాయలను విసిరేసి రౌడీయిజం చెలాయించారు. దీనిపై రైతులు, చిరువ్యాపారులు తీవ్రంగా ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ ఇంత అధిక మొత్తం వసూలు చేసిన దాఖలాలు లేవని, ఇలా అయితే ఎలా బతకాలంటూ వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అసలు గుత్తేదారునికి ఆదేశాలు రాకుండానే గేటు రుసుము వసూలు చేసుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలు పాటించాల్సిందే..

వారపు సంతలో గేటు వసూలుకు నిబంధనలు పాటించాల్సిందే. అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదు అందితే కాంట్రాక్టు రద్దు చేస్తాం. ప్రస్తుతం వేలం దక్కించుకున్నవారు అక్టోబర్ 1వ తేదీ నుంచే కాంట్రాక్టు వర్తిస్తుంది. పంచాయతీ సిబ్బంది ద్వారా ఈ వారం గేటు వసూలుచేస్తున్నాం. గుత్తేదారులు కూడా రుసుము వసూలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలి.

– మహేశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి, చంద్రగిరి